తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

- కరీంనగర్–వరంగల్ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం కాకముందే ఆకాశాన్నంటుతున్న భూ ధరలు
- మూడింతలు పెరిగిన రేట్లు
- మారనున్న హుజూరాబాద్ మండల రూపురేఖలు


పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులో బైపాస్ రోడ్డు కోసం పొలాన్ని చదును చేసిన దృశ్యం

హుజూరాబాద్‌రూరల్ : ప్రస్తుత కరీంనగర్–వరంగల్ రహదారిపై రాకపోకలు పెరిగి తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో కరీంనగర్–వరంగల్ బైపాస్ రోడ్డు మంజూరైంది. ఈ పనులు వెంటనే సాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. బైపాస్ రోడ్డు పూర్తయితే హుజూరాబాద్ పట్టణవాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. వాహనాలు పట్టణానికి రాకుండా నేరుగా గమ్యస్థానాలకు చేరేలా బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది.

ప్రస్తుత రహదారి ఇలా...

కరీంనగర్–వరంగల్ రహదారిపై ఇరుకుగా ఉండటంతో ఎల్కతుర్తి మండల పరిధిలోని దమ్మక్కపేట శివారు నుంచి సింగాపూర్ గ్రామ శివారు వరకు ఏదో ఓ చోట కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వాహనదారులు ఇరుకు రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వరకు ఇలాంగే ఉండటంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, లారీలు, డీసీఎంల డ్రైవర్లు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బైపాస్ రోడ్డు ఇలా...

కరీంనగర్ నుంచి వరంగల్ వరకు చేపట్టనున్న బైపాస్ రోడ్డు హుజూరాబాద్ మండలం మీదుగా వెళ్తుంది. మండలంలోని సింగాపూర్, సిర్సపల్లి, రంగాపూర్, రాంపూర్, రంగనాయకుల గుట్ట, కనుకులగిద్దె, చిన్న పాపయయ్యపల్లె, పెద్ద పాపయ్యపల్లె మీదుగా రోడ్డు నిర్మాణం జరుగుతోంది. సుమారు 15 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుంది. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ సైతం పూర్తికాగా, భూములను కోల్పోయిన రైతుల ఖాతాల్లో డబ్బులు సైతం జమయ్యాయి.

భూముల ధరలకు రెక్కలు..

హుజూరాబాద్ పట్టణంలో గుంట భూమి రూ. 5 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.10 లక్షల పైనే ఉంది. హుజూరాబాద్ మీదుగా బైపాస్ రోడ్డు వెళ్తుండటంతో పాత కరీంనగర్–వరంగల్ రహదారికి అనుకొని ఉన్న భూముల ధరలు పడిపోయాయి. బైపాస్ రోడ్డు మంజూరైన ప్రాంతాల్లో రియల్టర్లు భూములను కొనుగోలు చేస్తుండటంతో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సింగాపూర్, సిర్సపల్లి, కొత్తపల్లి క్వారీ ఏరియా, రంగాపూర్, రాంపూర్, జమ్మికుంట క్రాస్‌రోడ్డు, రంగనాయకుల గుట్ట ఏరియా, కనుకులగిద్దె, చిన్న పాపయ్యపల్లె, పెద్ద పాపయ్యపల్లె గ్రామాల్లో వ్యవసాయ భూములు మంచి ధర పలుకుతున్నాయి. గతంలో ఎకరాకు రూ.20 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ.60 లక్షలు పలుకుతోంది. బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం కాకముందే ఈ ధరలు ఉంటే.. పనులు పూర్తయితే రియల్టర్ వ్యాపారం మరింత జోరందుకోనుంది.

పొలాలకు వెళ్లాలంటే కష్టమే

బైపాస్ రోడ్డు నిర్మాణంతో భూములను కోల్పోతున్న రైతులు అటు రోడ్డు వస్తుందన్న ఆనందం ఉంటే..మరో వైపు మిగిలిన భూముల్లో సాగు పనులు చేద్దామంటే ఎదురయ్యే ఇబ్బందులను తల్చుకుంటూ బాధపడుతున్నారు. కొన్నిచోట్ల రహదారి పొలం మధ్యలో నుంచి వెళ్తుండటంతో గట్ల రోడ్లు పూర్తిగా కనుమరుగు కానున్నాయి.

భూమి పోతుంటే బాధగా ఉంది



బైపాస్ రోడ్డు పొలాల మధ్యలో నుంచి వెళ్తుండటంతో భూమిని కోల్పోవాల్సి వస్తుంది. భూమిని నమ్ముకొని జీవిస్తున్న మాక బైపాస్ రోడ్డు కింద భూమి పోతుండటంతో బాధగా ఉంది. భూసేకరణలో సైతం తక్కువ ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయటంతో భూమికి వచ్చిన డబ్బులు ఏ మాత్రం సరిపోవు.

– బోడ శంకర్‌రెడ్డి, రైతు, రంగాపూర్

పనులు త్వరగా పూర్తి చేయాలి



బైపాస్ రోడ్డు పనులు ప్రారంభిస్తే మిగిలిన వ్యవసాయ భూమిలో సాగుపనులు చేసుకునే అవకాశం ఉంటుంది. బైపాస్ రోడ్డు కోసం సేకరించిన భూమి పక్కన హద్దు రాళ్లు వేయటంతో సాగు పనులకు అటంకం ఏర్పడుతోంది. అధికారులు బైపాస్ రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

– మంతెన తిరుపతి, రైతు, మంతెనపల్లి

ఖాతాల్లో డబ్బులు జమ



కరీంనగర్–వరంగల్ బైపాస్ రోడ్డు కింద భూములను కోల్పోతున్న రైతుల ఖాతాల్లో ప్రభుత్వ ఆదేశానుసారం రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. భూసేకరణ కూడా పూర్తయింది. రోడ్డు పనులు మొదలయ్యాయి. మండలంలో బైపాస్ రోడ్డు పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కోమల్‌రెడ్డి, తహసీల్దార్, హుజూరాబాద్

క్లుప్తంగా

'అనుచిత వ్యాఖ్యలు సహించం'


మాట్లాడుతున్న అంజయ్య గౌడ్

తిమ్మాపూర్: ప్రజా పోరాటంలో భాగంగా రామకృష్ణకాలనీలోని సర్వే నంబర్ 1183, 1184, 1190లో మూడెకరాల 24 గుంటల ప్రభుత్వ భూమిపై పోరాటం చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు మాచర్ల అంజయ్యగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన రియల్టర్ నడిగొట్టి రవి ఇటీవల తనపై ఆరోపణలు చేసినందుకు ఆదివారం గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సారెస్పీ భూమి నడిగొట్టు రవికి ఎలా వచ్చిందని ప్రశ్నించాడు. 629 సర్వే నంబర్‌లోని 2 ఎకరాల భూమిని కబ్జా చేశాడని ప్రశ్నించారు. మల్లాపూర్‌లో చెరువు శిఖం భూమిని కబ్జా చేసిందేవరో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. తన పేరును బదానం చేసేందుకు రవి ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు . 5 ఎకరాల భూమి ఉండగా, తమ అక్కర నిమిత్తం గతంలో 2 ఎకరాలు అమ్మినం అని, తన పోరాటం ఫలితంగానే ఎస్సారెస్పీ అధికారులు స్పందించి హద్దులు నిర్ణయించారని, అధికార బలంతోనే హద్దు రాళ్లు, భూ కబ్జాలు చేస్తున్నాడని, వ్యక్తిగత ఆరోపణలు చేసే ముందు, ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాలు ఆదర్శం

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని వీణవంక ఉపసర్పంచ్ ఓరెం భానుచందర్ అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. దళితబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, వివిధ రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు దళితబంధు అమలు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులకు అవగాహన లేక బీఆర్‌ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'ఏం అభివృద్ధి సాధించారని దశాబ్ది ఉత్సవాలు'


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నిషాని రాంచంద్రం


మానకొండూర్: రాష్ట్రంలో ఏం అభివృద్ధి సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషాని రాంచంద్రం బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మండలంలోని కొండపల్కల గ్రామంలో వివిధ పార్టీల నుంచి నాయకులు బీఎస్పీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బహుజన ఉద్యమం వల్లనే బీసీ కులాలు బాగుపడుతాయని, రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, కమ్యూనిస్ట్ పార్టీలు బీసీలకు వ్యతిరేకమని ఆయా పార్టీలు బీసీలకు చేసిన అన్యాయాన్నీ వివరించారు. దేశంలో బీసీ కుల గణన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంద బాలయ్య, జిల్లా కార్యదర్శి కుమ్మరి సంపత్, మండల అధ్యక్షులు దాసరి కొంరయ్య, మండల కార్యదర్శి గన్నవరం రమేష్, శ్రీనివాస్, అజయ్, దేవగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


పరామర్శిస్తున్న తూడి లచ్చన్న

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి రాకేశ్ ఇటీవల కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం తూడి లచ్చన్న యువసేన అధినేత పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పదివేల ఆర్థికసాయం అందించాడు. సకాలంలో కోలుకోవాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఓ గార్డెన్‌లో విజయతేజస్విని జూనియర్ కాలేజీ 1999–2001 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులతోపాటు రవీందర్‌రెడ్డి, తిరుపతి, మహేందర్‌రెడిడ, ఉమేష్‌రెడ్డి, శోభారాణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


శ్రీకృష్ణయాదవ సంఘం కార్యవర్గం

గన్నేరువరం: మైలారం గ్రామ శ్రీకృష్ణయాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మర్రి వెంకటమల్లు, ఉపాధ్యక్షుడిగా ఇట్టవేణి నాగరాజు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామని సభ్యులు తెలిపారు. అనంతరం నూతన కమిటీని యాదవ సంఘం సభ్యులు శాలువా సన్మానించారు.

నియామకం

సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డిని టీపీజేఎంఏ(తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యం అసోసియేషన్) కరీంనగర్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నియామకమయ్యారు. రాష్ట్ర నాయకత్వం రాజేశ్వర్‌రెడ్డిని జిల్లా అసోషియేట్ ప్రెసిడెంట్‌గా నియమించడంపై సర్పంచ్, వెన్కెపల్లి సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రకాశ్‌జవదేకర్‌ను కలిసిన వెంకట్‌రెడ్డి


ప్రకాశ్‌జవదేకర్‌తో వెంకట్‌రెడ్డి

శంకరపట్నం: మాజీ కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకట్‌రెడ్డి ఆదివారం కరీంనగర్‌లో కలిశారు. జిల్లాలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


రేషన్ షాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: అల్గునూర్‌కు చెందిన అవునూరి మల్లేశం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హామీ ఇచ్చారు. ఆదివారం మల్లేశం పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధైర్య పడొద్దు ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలో నూతన రేషన్‌షాపును ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సర్పంచ్ అంజయ్య ఉప సర్పంచ్ అనిల్ గౌడ్, మాజీ ఎంపీపీ ప్రేమలత, పాశం అశోక్ రెడ్డి, స్వామి రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మానకొండూర్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 13న మానకొండూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మహిళా సంక్షేమ దినోత్సవం, మహిళా ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే సభా స్థలాన్నీ పరిశీలించారు. సంబురాలను ఘనంగా నిర్వహించాలని, భారీ ఎత్తున హాజరైయ్యే సభకు అన్నిఏర్పాట్లతో పాటు, వసతులు కల్పించాలని సూచించారు. వెంట జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ గుడి ఆలయానికి గ్రామానికి చెందిన విద్యార్థి సంఘం నాయకుడు పర్లపల్లి నాగరాజు ఆదివారం రూ.11,111 విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనవేన రాజమల్లు, బంగారి తిరుపతి, ఉమ్మడి సుదర్శన్, గుర్రపు సంపత్ రెడ్డి, బోళావేన ఎర్రయ్య, పోతరాజు కుమారస్వామి, బొజ్జం సుమన్‌రెడ్డి, కోడారి ప్రశాంత్‌రెడ్డి, పర్లపల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

గంగాధర: మండలంలోని కురిక్యాల గ్రామంలో ఆదివారం పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి మహిళలు నెత్తిన బోనంతో దేవాలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గావు


అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీనాథ్‌రెడ్డి

కార్యక్రమాన్ని చూడటానికి గ్రామస్తులు భారీగా తరలి వచ్చారు.

ఏరడపల్లిలో..

శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో పోచమ్మ తల్లికి ఆలయానికి తరలి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రేణుకాఎల్లమ్మను దర్శించుకున్న శ్రీనాథ్‌రెడ్డి

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామం శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారిని ఆదివారం చొక్కారావుపల్లె ఉప సర్పంచ్, కాంగ్రెస్ యువ నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గుర్రం


గంగాధర: కురిక్యాలలో బోనాలతో మహిళలు

వాసుగౌడ్, కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు కొలుపుల రవీందర్, మాతంగి అనిల్, శ్రీధర్‌రెడ్డి తిపర్తి పరిపూర్ణచారీ, గంప మహేష్, వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు బహూకరణ

రామడుగు: మండల కేంద్రంతో పాటు, వన్నారం గ్రామానికి చెందిన పలువురు మహిళలకు కొత్తపల్లి పట్టణానికి చెందిన అన్నపూర్ణ సెలక్షన్ యజమానులు పెంటి శ్రీనివాస్, రాజమౌళి ఆదివారం నూతన వస్త్రాలు బహూకరించారు. ఆయా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన మడేలేశ్వర దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బోనాలు ఎత్తుకునే మహిళలకు నూతన బట్టలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తౌటు మురళి, చిట్కూరి శ్రీనివాస్, పూసల లచ్చయ్య, పూసల అంజయ్య, సర్పంచ్ జాడి లక్ష్మిరాజమల్లయ్య, ఎంపీటీసీ జువ్వాజి హరీశ్ తదితరులు పాల్గొన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సాహిత్య దినోత్సవం


దంపతులను సన్మానిస్తున్న మంత్రి గంగుల


గంగాధర: లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మంత్రి

చొప్పదండి: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాహిత్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చొప్పదండికి చెందిన ప్రముఖ కవి, రచయిత తాళ్లపల్లి ఛత్రపతి శ్రీనివాస్ దంపతులను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్,అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, సర్వార్ రవీందర్ సింగ్, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్, కొత్త అనిల్ కుమార్, గాజుల రవీందర్, అనంతాచార్య, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం సాహిత్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కవి తిప్పారపు లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణను మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు తదితరులు ఘనంగా సన్మానించారు.

దివ్యాంగుల సంబురాలు


ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

హుజూరాబాద్‌రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల పింఛన్ రూ.3,016 నుంచి రూ.4,116 పెంచిన సందర్భంగా హుజూరాబాద్ డివిజన్‌లోని దివ్యాంగులందరూ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు శీలం రాజిరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవుల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు కంకణాల రవీందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పరబ్రహ్మాచారి, ఉపాధ్యక్షులు కల్లూరి స్వప్న, కార్యదర్శి రవీందర్, ప్రచార కార్యదర్శి చికోటి వెంకటరమణ, లక్ష్మి, మంతెన తిరుపతి, తిప్పారపు సంపత్, అమరేందర్, బోలవేన మొగిలి, రాజిరెడ్డి, ఎ.తిరుపతి, అనుష, బేతి రాజేందర్, శ్రీనివాస్, లింగారెడ్డి, రాజేందర్, రాజు, భాస్కర్, భిక్షపతి, లక్ష్మన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

జమ్మికుంట: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు పిల్లలకు గాయాలైన ఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. గుండేటి శ్రీకాంత్ అనే వ్యక్తి కారులో భార్య, ఇద్దరు పిల్లలతో జమ్మికుంట వైపుగా వస్తుండగా నాగంపేట శివారులో ఎదురుగా వస్తున్న గోదావరిఖనికి చెందిన బల్లారి రాజేందర్ అనే వ్యక్తి అజాగ్రత్తగా కారు నడుపుతూ వచ్చి ఎదురుగా ఢీ కొట్టాడు. దీంతో శ్రీకాంత్ కారులోని ఇద్దరు పిల్లలు అపూర్వ, శాస్త్రలకు గాయాలయ్యాయి. బాధితుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

సామాజిక సేవ అభినందనీయం


నోట్‌బుక్స్ అందజేస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మేదరుల సామాజిక సేవ అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో మేదరి ఉద్యోగులు, కులస్తుల సంఘాల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేదరి కులస్తులు విద్య, ఉద్యోగ రంగాల్లో ముందుండాలని, పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని, మేదరి కులస్తులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లి నరహరి పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈకార్యక్రమంలో మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్, చింతల శ్రీనివాస్, కూచనపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో 'గడపగడపకూ కాంగ్రెస్'


మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 500 సిలిండర్ అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ ఇస్తే అధికారం అనుభవిస్తున్న కేసీఆర్ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ నియామకాల్లో పేపర్ లీకేజీ స్కామ్‌లకు పాల్పడ్డరని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదని, నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. డబుల్‌బెడ్‌రూం, దళితులకు మూడెకరాలు, రుణమాఫీ, దళితబంధు పథకాలు నిధులు లేక నిలిచిపోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వరి ధాన్యంకు రూ.2,500 మద్దతు ధర, రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని, ఆరోగ్య శ్రీ పునఃరుద్ధరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ కవ్వపద్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహంగీర్, ఇసాయొద్దీన్, గ్రామశాఖ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, పచ్చిమట్ల కొంరయ్య, దర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న జాగిరి శ్రీనివాస్‌గౌడ్

గన్నేరువరం: గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి జాగిరి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని గునుకుల కొండాపూర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వృత్తిపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం లక్ష రూపాయల పథకంలో అవకాశం కల్పించకపోవడం బాధాకరమన్నారు. జనాభా ప్రతిపాదికన 30 శాతం గౌడ కులస్తులకు ద్విచక్ర వాహనాలు ఇస్తామని మొండిచేయి చూపించిందన్నారు. 560 జీవో ప్రకారం ఐదెకరాల భూమి పత్తా లేదని, కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా తోడ్పడాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, యూత్ నాయకులు సాయితేజ గౌడ్ పాల్గొన్నారు.